Follow: @ANNTELUGU
20-06-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 169 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



కార్పొరేట్ ఆఫీస్ ను ప్రారంభిస్తున్న చైర్మన్ కైలా శ్రీనివాస్

## ఫార్మ్ ల్యాండ్ ముసుగులో శ్రీకారం నయా దందా

**'ఐకానిక్' 'ఆయుష్మాన్ భవ్, వెంచర్ల లో అనుమతులు నిల్ అమ్మకాలు ఫుల్ '**

- లక్షల్లో స్టాంపుడ్యూటీ, నాలా ఎగవేత
- అధికారుల అండతో ఆగని అక్రమ రిజిస్ట్రేషన్ల పర్వం
- ప్రభుత్వ ఖజానాకి భారీ గండి
- అంతా ఆ తహసీల్దార్ల కనుసన్నల్లోనే !
- నిద్రమత్తులో డి పి ఒ, డి ఎల్ పి ఓ!
- శ్రీకారం' అక్రమ సంపాదనలపై 'ఐటీ' నజర్ !
- ఏసీబీ అధికారులు ఓ సారి నారాయణఖేడ్ మీద నిఘా పెట్టండి ?
- కొనుగోలుదారులు రోడ్డున పడితే గానీ జిల్లా కలెక్టర్ స్పందిచరా !

02

**టాప్ న్యూస్**

### అమెరికా- ఇరాన్ చర్చల్లో ప్రతిష్టంభన

- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి ఎఫెక్ట్
- పశ్చిమాసియాలో మళ్ళీ ఉద్రిక్తతలు




02

### అల్లు అర్జున్‌కు షాక్

- తొక్కిసలాట కేసులో హైకోర్టు సమన్లు
- సోమవారం విచారణకు హాజరు కావాలని ఆదేశం




02

జీహెచ్ఎంసీ పరిధిలో 200

### మరోసారి పెరగనున్న డివిజన్లు

సైబరాబాద్‌లో 100, మల్కాజ్ గిరిలో 100



02



### రాహుల్ గాంధీ కాబోయే ప్రధాని

- డాక్టర్ సెల్ రక్తదాన శిబిరంలో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

03

# లోన్ రాకుంటే.. టేకోవర్‌పై యూటర్న్?



**ఆధీనంలోకి తీసుకున్నాక ఆర్థిక సమస్యలతో పరేషాన్**



- కేంద్రం సహకరించకపోవడంతో ఫలించని సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం
- ఇప్పటికే రూ.6,598 కోట్ల పీకల్లోతు నష్టాల్లో కొనసాగుతున్న 'హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ'
- ప్రతి నెలా రూ.550 కోట్ల పైచిలుకు నిర్వహణ భారం, ఆదాయం అందులో సగం మాత్రమే
- ఇప్పుడున్న ఆర్థిక ఇబ్బందుల్లో ప్రభుత్వ రంగంలో నిర్వహణ అసాధ్యమంటున్న నిపుణులు
- మరో ప్రైవేట్ సంస్థకు 'మెట్రో' రాష్ట్ర సర్కారు యోచన..
- ఇప్పుడున్న మొదటి దశ, రాబోయే రెండో దశ కూడా..
- 'పీపీపీ మోడ్'లోనే అప్పగించే దిశగా అంతర్గతంగా కొనసాగుతున్న చర్యలు
- మొదటి దశ మెట్రో రైలు ప్రాజెక్టు ఆస్తుల విలువ సరాసరిగా రూ.30వేల కోట్ల పైమాటే..
- రెండో దశ రూ.43వేల కోట్ల అంచనా వ్యయంలో 10 శాతం మాత్రమే రాష్ట్ర వాటా
- సహకరించని కేంద్రానికి సవాలుగా సొంత వ్యూహం
- సీఎం రేవంత్ ఆదేశాలతో ప్రత్యామ్నాయ కార్యాచరణపై కసరత్తు చేస్తున్న అధికారులు

(రాజేష్ జైన్ నిడార్కర్)

కేంద్ర ప్రభుత్వంతో సఖ్యత లేని కారణంగా రేవంత్ సర్కారు వ్యూహాలు ఒక్కొక్కటిగా బెడిసికొడుతున్నాయి. అత్యంత ప్రధానమైన హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టు 'టేకోవర్' ప్రక్రియ తాత్కాలికంగా స్తంభించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన మేరకు ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్సీ) మంజూరు చేసిన రూ.13,600 కోట్ల రుణాన్ని సాంకేతిక కారణాలతో కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఇప్పటికే కుదుర్చుకున్న ఎంవోయూ ప్రకారం ఎల్‌అండ్‌టీ సంస్థలకు నిధులు చెల్లించేందుకు మార్గం తోచక అయోమయం నెలకొంది. నిబంధనల ప్రకారం మే నెలాఖరుతో సంస్న నిర్వహణ కాలపరిమితి ముగిసింది. జూన్ 1 నుంచి ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతోంది. నిధుల చెల్లింపునకు మిగతా 2వ పేజీలో

# గాంధీ సరోవర్‌కు రక్షణశాఖ గ్రీన్ సిగ్నల్

- గాంధీ సరోవర్‌కు రక్షణశాఖ గ్రీన్ సిగ్నల్
- రాజ్ నాథ్ కు థ్యాంక్స్ చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి
- ఇక మూసీ ముందుకే




**హైదరాబాద్, మహా :** గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ గ్రీన్ సిగ్నల్ లభించింది. గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ పరిధిలోని 83.818 ఎకరాల రక్షణ శాఖ భూమిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు, సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. రక్షణ మంత్రిత్వ శాఖ సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరుపున ధన్యవాదాలని పేర్కొన్నారు.మూసీ పునరుజ్జీవనంలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు కీలక మైలురాయిగా భావిస్తున్నామని .మూసీ పరివాహక ప్రాంతాన్ని సాంస్కృతిక ప్రజా వారసత్వ ఆస్తిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తేల్చిచెప్పారు.

**150 మీటర్ల ఎత్తులో గాంధీ విగ్రహం**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్‌లోని బాపూఘాట్ (ఈసీ, మూసీ నదుల సంగమ ప్రాంతం) వద్ద 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా బాపూఘాట్ వద్ద సుమారు 150 మీటర్ల ఎత్తులో మహాత్మా గాంధీ భారీ విగ్రహం, మ్యూజియం, లండన్ ఐ తరహా రాట్నం, సైక్లింగ్ ట్రాక్‌లు, బోటింగ్ సదుపాయంతో పాటు పలు పర్యాటక ఆకర్షణలు అభివృద్ధి చేస్తున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డిజైనింగ్, డీపీఆర్ ఇదివరకే సిద్ధమయ్యాయి. ఇపుడు పనుల నిర్వహణకు రక్షణ శాఖఅనుమతులు మంజూరు చేసింది. గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ పరిధిలోని 83.818 ఎకరాల రక్షణ శాఖ భూమిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భూమికి ఈ కీలకమైన క్లియరెన్స్ లభించడంతో బాపూఘాట్ వద్ద ప్రాజెక్టు నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయి. దీంతో ఇక మూసీ ప్రాజెక్టు ముందడుగు పడినట్లే.



### మణికొండలో..తెలంగాణ జనసేన కార్యాలయం

**ప్రారంభించిన పవన్ కల్యాణ్**

**మణికొండ, మహా :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మణికొండలో జనసేన కొత్త కార్యాలయాన్ని ప్రారంభించారు. గత కొద్ది రోజులుగా తెలంగాణ రాజకీయాలపై ప్రత్యేక దృష్టిసారించిన ఆయన.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సొంతంగా పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లోని మణికొండలో జనసేన పార్టీ తెలంగాణ నూతన రాష్ట్ర కార్యాలయాన్ని జనసేనాని పవన్ కల్యాణ్ తన చేతుల మీదుగా అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నాయకులు, పీఏసీ సభ్యులు, భారీ సంఖ్యలో తరలివచ్చిన జనసైనికులు, వీరమహిళలతో మణికొండ ప్రాంతం మొత్తం సందడిగా మారింది.



### సాయికృష్ణ కుటుంబానికి చంద్రబాబు భరోసా

- అదృశ్యంపై ఉన్నతస్థాయి దర్యాప్తు.

02



### విద్యాశాఖను వికాసం వైపు నడిపిస్తున్నాం

- పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు పంపిణీ
- విద్యాశాఖ వికాసానికి ప్రభుత్వం కట్టుబాటు
- విద్యకు బడ్జెట్‌లో 8.5 శాతం కేటాయింపు
- భావితరాల భవిష్యత్తుకు భారీ పెట్టుబడులు : సీఎం రేవంత్‌రెడ్డి

03




### అమరావతి అభివృద్ధిపై చంద్రబాబు సమీక్ష

- సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో రాజధాని పనులపై ఆదేశాలు

02

### కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన జయకేతనం

- ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో సక్సెస్
- గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు... విజయవంతమైన కార్యాచరణ..

02

### అన్నవరం సత్యదేవుని ఆదాయం కోట్లలో.. భక్తులపై భారం ఏల?

- రూ.157 కోట్లకు పైగా ఆదాయం అంచనా.
- అయినా పెరుగుతున్న రుసుములు, పారదర్శకతపై ప్రశ్నలు
- శాశ్వత ఈవో లేకపోవడం, రాజకీయ మర్యాదల ఖర్చులు, పరిపాలనపై విమర్శలు

03





మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | శనివారం, హైదరాబాద్ | 20-06-2026

ANN తెలుగు



# అమెరికా ఇరాన్ చర్చల్లో ప్రతిష్ఠంభన

- లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి ఎఫెక్ట్
- పశ్చిమాసియాలో మళ్ళీ ఉద్రిక్తతలు

**మహా** : ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంలోని సాంకేతిక అంశాలపై చర్చించేందుకు స్విట్జర్లాండ్ వెళ్లాల్సిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన పర్యటనను వాయిదా వేశారు. ఏర్పాట్లకు సంబంధించిన సమస్యల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు శ్వేతసౌధం వెల్లడించింది. మరోవైపు లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడుల ఎఫెక్ట్ దీనిపై ఉందన్న ప్రచారం జరుగుతోంది. అమెరికాఇరాన్ మధ్య కుదిరిన 14 అంశాల అవగాహన ఒప్పందం అమలుకు సంబంధించిన సాంకేతిక అంశాలను ఖరారు చేయడమే లక్ష్యంగా శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఈ చర్చలు జరగాల్సి ఉంది. అయితే ప్రయాణంపై వాన్స్ సందేహాలు వ్యక్తం చేయడంతో సమావేశం తేదీ ఇంకా ఖరారు కాలేదని ఇరాన్ ప్రతినిధులు తెలిపారు. గురువారం వైట్ హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జేడీ వాన్స్ మాట్లాడుతూ, ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంలోని తొలి దశ అమలుకు అమెరికా పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. అవగాహన ఒప్పందంలో పేర్కొన్న 60 రోజుల గడువు గురువారం నుంచే ప్రారంభమైందని చెప్పారు. ఈ కాలంలో ఇరుపక్షాలు అణు కార్యక్రమం, ఆంక్షల సడలింపు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై సాంకేతిక స్థాయిలో చర్చలు జరపనున్నట్లు తెలిపారు. ఇరాన్‌కు సంబంధించి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రూపొందించిన శాంతి ప్రణాళిక ఇప్పటికే అమెరికా ప్రజలకు ప్రయోజనాలు అందిస్తోందని వాన్స్ పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధి గుండా ఒక్క రోజులోనే 1.25 కోట్ల బ్యారెల్ల చమురు రవాణా జరిగిందని, ఇది ఘర్షణ ప్రారంభమైన తర్వాత అత్యధికమని చెప్పారు. చమురు ధరలు దాదాపు యుద్ధానికి ముందు స్థాయికి చేరుకున్నాయని, అమెరికాలో గ్యాసోలిన్ ధరలు కూడా గ్యాలన్‌కు 4 డాలర్ల కంటే దిగువకు పడిపోయాయని వివరించారు.

**లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి**

అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన కొన్ని గంటలకే లెబనాన్‌పై ఇజ్రాయెల్ పెద్ద ఎత్తున దాడులు చేసింది. దక్షిణ లెనాన్‌లోని నబతియే జిల్లాలో అర్ధరాత్రి IDF జరిపిన వైమానిక, రాకెట్ దాడుల్లో 16మంది మృతి చెందారు. కొందరు గాయపడటం లేదా గల్లంతయ్యారు. అనేక నివాసాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ ఈ దాడులు చేసినట్లు అంతర్జాతీయ వార్తా ఏజెన్సీలు తెలిపాయి. ఈ ప్రాంతంలో ఇజ్రాయెల్ సేనలు జరిపిన అతిపెద్ద దాడుల్లో ఇదొకటని పేర్కొన్నాయి. నబాతియే నగరంతోపాటు కఫర్ జౌజ్, కఫర్ రెమాన్, జెబ్షిట్ చుట్టుపక్కల అనేక పట్టణాల్లో ఈ దాడులు జరిగినట్లు అంతర్జాతీయ వార్త ఏజెన్సీలు తెలిపాయి. ఆ తర్వాత వరుస వైమానిక దాడులు కఫర్ టిబ్నిట్, రేహాన్ వంటి ఎత్తైన ప్రాంతాల్లో జరిగినట్లు తెలిపాయి. ఇజ్రాయెల్ జరిపిన ఈ దాడుల కారణంగానే అమెరికాఇరాన్ మధ్య జెనీవాలో శుక్రవారం జరగాల్సిన చర్చలు వాయిదా పడినట్లుగా భావిస్తున్నారు. ఫలితంగా పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# ఫార్మ్ ల్యాండ్ ముసుగులో శ్రీకారం నయా దందా

ప్రభుత్వ పన్నుల వసూళ్లలో పారదర్శకతను పెంచాల్సిన అధికారులే.. నిబంధనల ఉల్లంఘనలకు రక్షణ కవచంగా మారితే ఎలా ఉంటుందో నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితి దానికి అద్దం పడుతోంది. 'శ్రీకారం రియల్ ఎస్టేట్' సంస్థ సాగిస్తున్న 'ఐకానిక్' 'ఆయుష్మాన్ భవ్, అక్రమ వెంచర్లలో లక్షలాది రూపాయల స్టాంప్‌డ్యూటీ, నాలా ఫీజులు ఎగ్గొట్టి అక్రమార్కులు కోట్లాది రూపాయల సంపదహానే ధ్యేయంగా పెట్టుకుని ఫార్మ్ ల్యాండ్ ముసుగులో నయా దందా సాగిస్తుంటే సదరు మండలాల తహసీల్దార్లు ఆ అక్రమార్కులకు రెడ్ కార్పెట్ వేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు నయా పైసా రాకుండా.. లక్షలాది రూపాయల పన్నుల లూటీకి తెరలేపిన రియల్ కేటుగాళ్లకు స్థానిక రెవెన్యూ పెద్దల ఆశీస్సులు పుష్కలంగా లభిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**స్పెషల్ టాస్క్ ఫోర్స్ :**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్ సిర్గాపూర్, మనూర్ మండలాల పరిధిలో 'శ్రీకారం ఇన్ఫ్రా డెవెలపర్స్' 'ఆయుష్మాన్‌భవ్' ఐకానిక్ హౌసింగ్' సంస్థల పేరిట సాగుతున్న ఫార్మ్ ల్యాండ్ దందాలో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతుంది. నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి అమ్మినప్పుడు ప్రభుత్వానికి భారీగా రాబడి రావాలి. కానీ ఇక్కడ అంతా తహసీల్దార్ల కనుసన్నల్లోనే అక్రమ దందా కొనసాగుతోంది. వెంచర్ నిర్వాహకులు చట్టంలోని లొసుగులను వాడుకుంటూ కమర్షియల్ విక్రయాలు జరుపుతుంటే, అధికారులు మాత్రం కళ్ళు మూసుకుని వాటిని ఫార్మ్ ల్యాండ్ (వ్యవసాయ భూమి) కింద గుంటల లెక్కన రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. సిర్గాపూర్, మనూర్ మండలాల పరిధిలో ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం ఎకరం వ్యవసాయ భూమి ధర కేవలం రూ. 1,50,000 మాత్రమే. కానీ వెంచర్ నిర్వాహకులు గజం ధర ఏకంగా రూ. 3,000 లకు పైగా విక్రయిస్తూ పక్కా కమర్షియల్ విక్రయాలు జరుపుతున్నారు. దీని





వల్ల ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల స్టాంప్‌డ్యూటీ, నాలా కన్వర్షన్ ఫీజులు దారి మళ్లుతున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన చెల్లించాల్సిన 7.5% స్టాంప్‌డ్యూటీ, 3% నాలా ఫీజుల నిధులు నీళ్లపాలవుతుంటే.. అధికారుల జేబులు మాత్రం కాసుల గలగలతో నిండుతున్నాయని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

**నిద్రమత్తులో డి పి ఒ, డి ఎల్ పి ఓ! ..!**

తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామీణ పరిధిలో ఎలాంటి లేఅవుట్లు వేయాలన్నా జిల్లా పంచాయతీ అధికారుల పర్యవేక్షణ, అనుమతులు తప్పనిసరి. కానీ ఇక్కడ పంచాయతీ రాజ్ చట్టంలోని నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయి. అనుమతులు లేని వెంచర్లలో అక్రమ విక్రయాలు, యథేచ్ఛగా సాగుతుంటే .. అటు 'డిపిఓ' గానీ, ఇటు 'డి ఎల్ పి ఓ' గానీ కన్నెత్తి చూడకపోవడం వెనుక అసలు మతలబు ఏంటని ప్రజాసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు అందుతున్న మామూళ్ల మత్తులోనే మునిగి పోయారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**'శ్రీకారం' అక్రమ సంపాదనలపై 'ఐటీ' నజర్!**

మరోవైపు గజాల లెక్కన ప్లాట్లు అమ్ముతూ.. కాగితాలపై మాత్రం వ్యవసాయ భూమి (ఫార్మ్ ల్యాండ్) గా చూపిస్తూ 'గుంటల' లెక్కన రిజిస్ట్రేషన్లు చేస్తున్న ఈ సంస్థపై ఇప్పుడు ఆదాయపు పన్ను (ఐ టి ) శాఖ దృష్టి పడినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ మార్కెట్ విలువ రూ. 1.50 లక్షలు చూపిస్తూ, తెరవెనుక కస్టమర్ల నుండి ఎకరానికి రూ. 48 లక్షల నుండి రూ. కోటికి పైగా నల్లధనం (బ్లాక్ మనీ ) వసూలు చేస్తున్న ఈ సంస్థ అంతర్గత లావాదేవీలపై ఐటీ నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయని, త్వరలోనే హైదరాబాద్ లోని జె ఎన్ టి యూ సమీపంలో గల సంస్థ కార్యాలయాలపై ఆకస్మిక దాడులు (ఐటీ రైడ్స్) జరిపి, పన్నుల ఎగవేతపై భారీ జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

**ఏసీబీ అధికారులు ఓ సారి నారాయణఖేడ్ మీద నిఘా పెట్టండి ?**

ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన కోట్లాది రూపాయల స్టాంప్‌డ్యూటీ, నాలా ఫీజులను నిలువునా ముంచుతూ.. రియల్ మాఫియాకు రక్షణ కవచంగా మారిన నారాయణ్‌ఖేడ్ రెవెన్యూ లీలలపై అవినీతి నిరోధక శాఖ (ఏ సి బి ) తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, స్థానిక తహసీల్దార్ల కనుసన్నల్లోనే ఈ 'అక్రమ దందా' సాగుతోందని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

**కొసమెరుపు:** ఒకపక్క ఇంత తీవ్రమైన ఆరోపణలు వస్తున్నా, ఐటీ నిఘా నీడలు కమ్ముకుంటున్నా.. 'శ్రీకారం' నిర్వాహకులు మాత్రం కించిత్తు భయం లేకుండా సాక్షాత్తూ ఈ శుక్రవారమే జేఎన్‌టీయూ వద్ద ఏకంగా రెండు సరికొత్త ఆఫీసులు అట్టహాసంగా ఓపెన్ చేయడం ఈ దందాలో అసలైన కొసమెరుపు! "మాకు అందాల్సిన అండదండలు మాకున్నాయి" అనే ధీమా ఉంటే తప్ప ఈ స్థాయిలో బరితెగించడం సాధ్యం కాదు. కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పందించి ఈ అక్రమాలకు బ్రేకులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

**కలెక్టర్ ప్రతీక్ సాబ్.. ఇటు చూడండి..!**

స్థానిక యంత్రాంగం పూర్తిగా రియల్ మాఫియా గుప్పిట్లోకి వెళ్లిపోయిన తరుణంలో, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తక్షణమే స్పందించి, మనూర్ తహసీల్దార్ విష్ణు సాగర్, మరో కీలక ఉద్యోగి ఖాజా, సిర్గాపూర్ తహసీల్దార్ కిరణ్ ల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, రియల్ ఎస్టేట్ మాఫియాకు అండగా నిలుస్తున్న అధికారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఫార్మ్‌లాండ్ ముసుగులో కమర్షియల్ విక్రయాలు చేస్తూ, అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తూ కోట్ల రూపాయల సంపాదనే ధ్యేయంగా సాగుతున్న 'శ్రీకారం' అక్రమ వెంచర్ల ('ఐకానిక్' 'ఆయుష్మాన్ భవ) విక్రయాలను, రిజిస్ట్రేషన్లను తక్షణమే నిలిపివేసి (సీజ్ చేయాలని) స్థానికులు, బాధితులు, ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# జీహెచ్ఎంసీ పరిధిలో 200

**హైదరాబాద్, మహా :** ఓఆర్ఆర్ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో మరోసారి డివిజన్ల పునర్విభజన కు రంగం సిద్ధమైంది. గతంలో ఉన్న జీహెచ్ఎంసీలో ఓఆర్ఆర్ పరిధిలోని 27 నగరపాలక, పురపాలక సంస్థలను కలిపి మార్చి నెలలో మూడు కార్పొరేషన్లుగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మార్పులు, చేర్పుల అనంతరం ఏర్పడిన జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)ల పరిధిలో మరోసారి డివిజన్ల పునర్విభజన చేశాకే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి మున్సిపల్ అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. తొలుత జీహెచ్ఎంసీకి మాత్రమే ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. జీహెచ్ఎంసీ పాలక వర్గం గడువు ఫిబ్రవరితో ముగిసిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రత్యేకాధికారి జయేశ్ రంజన్ పాలనలో ఉంది. పాత బస్తీ నియోజకవర్గాలు కాకుండా బయటి ప్రాంతంలో ఉన్న నియోజకవర్గాల్లో మరిన్ని డివిజన్లను కలిపి కొత్త డివిజన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. 200 డివిజన్లలో 101 గెలిచిన పార్టీకి చెందిన వ్యక్తే మేయర్ పీఠంపై ఆసీనులవుతారు. దీన్ని పరిగణలోకి తీసుకుని డివిజన్ల పునర్వ్యవస్థీకరణ జరుగుతుందని రాజకీయంగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. తొలుత జీహెచ్ఎంసీకి నిర్వహించాక సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

# కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన జయకేతనం

**కరీంనగర్ మహా :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా పూర్తై సమగ్ర అభివృద్ధికి కొత్త దిశను చూపింది. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చింది. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పారదర్శక పాలనకు ఈ కార్యక్రమం వేదికగా నిలిచింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నాయకత్వంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో కార్యక్రమాలు సమర్థవంతంగా అమలయ్యాయి. పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారం, రోడ్డు భద్రత, వ్యవసాయం, సంక్షేమ పథకాలు, ఆరోగ్యం, విద్య, ఉపాధి వంటి 10 ప్రధాన అంశాలపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. జిల్లాలోని 318 గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో విస్తృత పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించగా, 4,290 పెండింగ్ ఫైళ్లను పరిష్కరించారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచి ప్రమాదాల నియంత్రణలో మంచి ఫలితాలు సాధించారు.

**పథకాల పరంపర**

వ్యవసాయ రంగంలో రైతు భరోసా కింద 1.93 లక్షల మంది రైతులకు రూ.143.55 కోట్లు అందించగా, రైతు బీమా ద్వారా 206 కుటుంబాలకు రూ.13.35 కోట్ల ఆర్థిక సాయం అందించారు. 319 కొనుగోలు కేంద్రాల ద్వారా భారీ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలోనే జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందింది. సంక్షేమ పథకాల అమలులోనూ జిల్లా ఆదర్శంగా నిలిచింది. కొత్తగా 45,920 రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్ల పథకాల ద్వారా లక్షలాది కుటుంబాలు లబ్ధి పొందాయి. వైద్యం, విద్య రంగాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టగా, మెగా జాబ్ మేళాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారు. ప్రభుత్వ సంకల్పం, ప్రజాప్రతినిధుల చొరవ, జిల్లా యంత్రాంగం సమర్థ నిర్వహణ, ప్రజల భాగస్వామ్యంతో కరీంనగర్ జిల్లా రాష్ట్రానికే దిక్సూచిగా నిలిచింది. ఈ 99 రోజుల ప్రగతి ప్రణాళిక ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న సమర్థ పాలనకు నిదర్శనంగా నిలిచింది.

# అమరావతి అభివృద్ధిపై చంద్రబాబు సమీక్ష

**అమరావతి, మహా** : రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ముఖ్యంగా బ్యాంక్‌స్ట్రీట్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాజధానిని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, నివాస యోగ్యమైన నగరంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజధాని అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి, అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రధానంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని బ్యాంక్ స్ట్రీట్ నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన అనుమతుల ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని చంద్రబాబు స్పష్టం చేశారు. బ్యాంక్ స్ట్రీట్‌లో కార్యాలయాల ఏర్పాటుకు 13 బ్యాంకులు ముందుకు రాగా, వాటిలో 11 సంస్థలు తమ భవన నిర్మాణ బాధ్యతలను సీపీ డబ్ల్యూడీకి అప్పగించాయని అధికారులు సీఎంకు



వివరించారు. ఈ నిర్మాణాలను పూర్తి సమన్వయంతో వేగంగా పూర్తి చేసేలా చూడాలని సీఆర్డీఏ అధికారులకు సూచించారు. రాజధానిలో డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి అన్నారు. ఫోన్, కేబుల్, ఇంటర్నెట్ వంటి కనెక్టివిటీ సేవల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో కృష్ణా కరకట్ట నిర్మాణం, ఉండవల్లిలో ఎల్పీఎస్ లేఅవుట్ల అభివృద్ధి, పార్కింగ్ కాంప్లెక్స్, జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం వంటి ఇతర అంశాలపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ వర్చువల్‌గా పాల్గొనగా, మున్సిపల్, సీఆర్డీఏ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# లోన్ రాకుంటే.. 'టేకోవర్'పై యూటర్న్?

( మొదటి పేజీ తరువాయి )

పెట్టిన గడువు కూడా ఈ నెల 15తో ముగిసింది. ఆలోగా రుణం వస్తుందని భావించిన సీఎం రేవంత్ రెడ్డి ఊహించని విధంగా గట్టి ఎదురుదెబ్బే తగిలింది. ప్రతి నెలా రూ.550 కోట్ల పైచిలుకు నిర్వహణ భారం ప్రభుత్వానికి మోయలేని స్థితికి చేరుకుంది. ఆదాయం చూస్తే అందులో సగం మాత్రమే కనిపిస్తోంది.

అదే సమయంలో మెట్రో టేకోవర్ సమయంలో ఆయా బ్యాంకుల నుంచి బదిలీ చేసుకున్న అప్పులపై (అసలు, వడ్డీ కలిసి) ప్రతినెలా రూ. 450 కోట్ల వరకు కిస్తీలు చెల్లించాల్సి ఉంది. ఈ తాజా పరిణామాల మధ్య రెండో దశ ప్రాజెక్టు ప్రశ్నార్థకమవుతోంది. వాస్తవానికి పెరుగుతున్న జనాభాతో హైదరాబాద్ నగర ప్రయాణికులకు మెట్రో రైలు అత్యంత కీలకమైనదిగా తయారైంది. ఇక అవశ్యమైన మెట్రో రైల్ ఫేజ్ 2 విస్తరణ ప్రాజెక్టు రాజకీయ దుమారానికి కేంద్రబిందువుగా మారింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఆలస్యం కావడం వెనుక కేంద్ర ప్రభుత్వం, కొందరు కీలక నేతల రాజకీయ కుట్రలు ఉన్నాయంటూ చేసేదేమీ తోచక సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేసి ప్రధాని మోడీతో కొత్త పంచాయతీకి దిగారు. నగర రవాణా ముఖచిత్రాన్ని మార్చేసి ఈ మెట్రో విస్తరణను కావాలనే అడ్డుకుంటున్నారని విమర్శలు గుప్పించడంతో మొదటి దశ టేకోవర్కు రుణమే కాదు.. రెండో ఎన్వోసీకి అవకాశమే లేకుండా పోయింది.

మెట్రో మొదటి దశను నిర్వహించిన ఎల్అండ్ సంస్థ భారీ నష్టాల కారణంగా ఫేజ్ 2 విస్తరణకు ముందుకు రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ సలహా మేరకే ఎలాంటీ నుంచి మెట్రోను తన ఆధీనంలోకి తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.1,400 కోట్ల మార్టిన్ మనీతో పాటు రూ.84 కోట్ల ప్రాసెసింగ్ ఫీజును కూడా ఐఆర్ఎఫ్సీ చెల్లించింది. ఎల్అండ్ టీ మెట్రోకు ఉన్న రూ. 13వేల 600 కోట్ల బ్యాంక్ రుణాలను క్లియర్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఒక జపాన్ సంస్థ నుండి 4 శాతం అతితక్కువ వడ్డీకి రీఫైనాన్స్ ప్యాకేజీని ఒప్పించింది. జపాన్ సంస్థ ఇప్పటికే ఈ నిధులను ఐఆర్ఎఫ్సీకి బదిలీ చేసినా.. ఈ నెల 15 నాటికే అందాల్సిన నిధులు అనివార్య కారణాలతో నిలిచిపోయాయి. కానీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి పత్రాలను సమర్పించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఈ నిధుల బదిలీని నిలిపివేసింది. కేంద్ర ప్రభుత్వం 122 కిలోమీటర్ల మెట్రో ఫేజ్ 2 విస్తరణ ప్రాజెక్టులో భాగస్వామిగా ఉండటానికి ఇష్టపడక పోగా మొదటి దశ టేకోవర్కు కూడా పరోక్షంగా అడ్డుకుంటోందని రేవంత్ సర్కారు ఆరోపిస్తోంది.

కొత్తగా వచ్చిపడిన ఈ సమస్య కారణంగా



ముందడుగు వేసి మార్కాలెక్కడా తోచడంలేదు. దేశంలో అభివృద్ధి చెందిన మెట్రోపాలిటన్ నగరాల సరసన చేరిన హైదరాబాద్లో రెండో దశ మెట్రో ప్రాజెక్టు పూర్తి చేయడాన్ని రేవంత్ రెడ్డి సర్కారు ప్రతిష్టాత్మకంగా భావిస్తుండగా.. పరిణామాలు క్రమక్రమంగా ప్రతికూలంగా మారుతున్నాయి. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ఒకప్పుడు దేశంలో ఢిల్లీ తర్వాత రెండోస్థానం దక్కించుకోగా. దివాలా తీసిన కారణంగా ప్రస్తుతం 9వ స్థానానికి పడిపోయింది. ప్రయాణికులకు సౌకర్యంగా ఉన్నా, ఆర్థికంగా మాత్రం కష్టాల్లో ఉంది. అనేక కోణాల్లో ప్రతికూలతలు వెంటాడుతున్న కారణంగా ప్రారంభం నుంచి నష్టాలు వస్తూనే ఉన్నాయి. ఒకప్పటి కరోనా లాక్ డౌన్ వల్ల రాబడి తగ్గిపోయి ఊహించనంత నష్టం వాటిల్లింది. ఆ నష్టం నుంచి కోలుకునేందుకు అనేక మార్గాలను అన్వేషించినా.. ప్రభుత్వం చేయూత అందించినా.. ఆశించిన స్థాయిలో భర్తీ కాలేదు. తీసుకున్న రుణాల వడ్డీలు కట్టలేక నష్టాలు మరింత పెరిగిపోయాయి.

హైదరాబాద్ జీవనశైలిలో ఓ భాగమైన హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు ప్రయాణీకులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తున్నప్పటికీ, ఆర్థికంగా మాత్రం తీవ్రమైన సంక్షోభంలోనే కొట్టుమిట్టాడుతోంది. ఎల్అండ్టి సంస్థ సారథ్యంలో నడుస్తున్న ఈ ప్రజా రవాణా వ్యవస్థ ప్రారంభం నుంచే నష్టాల బాటలో పయనిస్తోంది. నష్టాలు, అందుకు కారణాలపై, గతంలో పరిస్థితులపై ఇటీవల రేవంత్ సర్కారు తెప్పించుకున్న ఆర్థిక నివేదికలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. 2002425 ఆర్థిక సంవత్సరం మధ్యంతర కాలంలో హైదరాబాద్ మెట్రో రైలు ఏకంగా రూ.625 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలోనూ పరిస్థితి ఏమీ మారలేదు. అప్పుడే మరో రూ.5.55 కోట్ల నష్టం వాటిల్లింది. 2017లో ప్రారంభమైన ఈ మెట్రో సేవలు గడిచిన ఏడేళ్లలో మొత్తం రూ.6,598.21 కోట్ల భారీ నష్టాన్ని నమోదు చేయడం అందోళన కలిగిస్తోంది.

హైదరాబాద్ నగర ప్రజల నుంచి విశేషమైన ఆదరణ పొందినప్పటికీ.. మెట్రో రైల్ ఆర్థికంగా కుదేలవ్వడానికి అనేక కారణాలు ఉన్నాయి. 202021 మధ్య ప్రపంచాన్ని వణికించిన కోవిడ్19 మహమ్మారి సమయంలో విధించిన లాక్డౌన్ కారణంగా దాదాపు ఒక సంవత్సరం పాటు మెట్రో సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ సమయంలో ప్రయాణికుల రాకపోకలు పూర్తిగా స్తంభించడంతో ఆదాయం భారీగా పడిపోయింది. మరోవైపు.. మెట్రో ప్రాజెక్ట్ కోసం తీసుకున్న భారీ రుణాల చెల్లింపుల భారం సంస్థపై తీవ్రంగా పడింది. వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు అధిక వడ్డీలు చెల్లించాల్సి రావడంతో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. ఈ అంశాలన్నీ కలిసి మెట్రోకు నష్టాలు వేల కోట్లకు చేరుకున్నాయి. ఈ పరిణామాల క్రమంలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్ (పీపీపీ) విధానం మినహా మరో మార్గం లేకుండా పోయింది.

దీంతో ఎల్అండ్ నుంచి టేకోవర్ చేసుకుంటున్న మొదటి దశ మూడు కారిడార్లతో పాటు రెండో దశ నిర్మాణం బాధ్యతలను కూడా మరో ప్రైవేట్ సంస్థకు అప్పగించే యోచనతో ప్రభుత్వం సంసిద్ధమవుతోంది. అల్అండ్ సంస్థ నుంచి అప్పట్లో ప్రభుత్వం కేటాయించిన భూములు, ఆస్తులు తిరిగి స్వాధీనం చేసుకునే ప్రక్రియను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేసి కొత్త సంసకు బాధ్యతలు అప్పగించేందుకు ప్రయత్నాలు ప్రభుత్వంలో జోరుగా జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. మొదటి దశ ఆస్తుల అంచనా విలువ రూ.30వేల కోట్లకు పైబడి ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. కానీ అప్పులున్న కారణంగా వడ్డీల భారం మోయలేక ఎల్అండ్ సంస్థ రూ.14వేల కోట్లకే ప్రభుత్వానికి ఇచ్చేసింది. ఇక రెండో దశ ప్రాజెక్టు పీపీపీ మోడ్లో అప్పగిస్తే.. దాదాపు రూ.43వేల కోట్ల అంచనా వ్యయంలో మెట్రో రెండో దశ 10 శాతం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ వాటాగా పెట్టుబడి భరించాల్సి ఉంటుంది.

# అల్లు అర్జున్ కు షాక్

**హైదరాబాద్, మహా :** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు సమన్లు జారీ చేసింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి ఆయనపై కేసు నమోదైన విషయం తెలిసిందే. సోమవారం విచారణకు హాజరు కావాలని సమన్లలో పేర్కొంది. ఈ కేసులో అల్లు అర్జున్‌ను ఏ11గా పోలీసులు చేర్చారు. ఏ1 నుంచి ఏ10 వరకూ నిందితులుగా సంధ్య థియేటర్ యాజమాన్యం ఉంది. ఈ ఘటనలో ఇప్పటివరకూ 19 మందికి సమన్లు జారీ అయ్యాయి. వీరి వ్యక్తిగత హాజరు తర్వాత విచారణ ప్రారంభం కానుంది. ఇప్పటికే 23 మందిని నిందితులుగా చేర్చి పోలీసులు ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.

**అసలేం జరిగిందంటే?**

2024, డిసెంబర్ 4న పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా... ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. థియేటర్‌కు వచ్చిన అల్లు అర్జున్‌ను చూసేందుకు ఒక్కసారిగా అభిమానులు దూసుకు రావడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో ఈ ఘటనకు థియేటర్ యాజమాన్యంతో పాటు అల్లు అర్జున్‌ను కూడా బాధ్యున్ని చేస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడు శ్రీతేజ్ కుటుంబానికి అల్లు అరవింద్‌తో పాటు మూవీ టీం అండగా నిలిచింది. ఫ్యామిలీకి ఆర్థిక సాయం అందించడం సహా శ్రీతేజ్ వైద్యానికి సాయం అందించారు. శ్రీతేజ్ పూర్తిగా కోలుకున్నాడు.

# ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

**యువకుడికి తీవ్ర గాయాలు, ఎంజీఎం కు తరలింపు**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మహేశ్వరం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై కొద్దిసేపటి క్రితం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి, గాయపడిన యువకుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే, ప్రమాదం జరిగిన కొంత సమయం గడిచినా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



# ప్రపంచ సికిల్ సెల్ డే, - ఫ్రైడే డ్రై డే కార్యక్రమాల నిర్వహణ

**మణుగూరులో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో సదస్సులు**

**మణుగూరు, మహా :** ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా మణుగూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి వంశపారంపర్యంగా సంక్రమించే రక్త సంబంధిత వ్యాధి అని, ముందస్తు పరీక్షలు, సరైన వైద్య సలహాలతో వ్యాధి ప్రభావాన్ని తగ్గించవచ్చని ప్రజలకు వివరించారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ముందస్తు



నిర్ధారణ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మణుగూరు మండలంలోని శివలింగాపురం గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణపై గ్రామస్తులకు సూచనలు చేశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కూలర్లు, నీటి డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా చూడాలని సూచించారు. వర్షాకాలంలో పరిశుభ్రత పాటించడం ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ప్రజలు ఆరోగ్య పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ పావని, వీరస్వామి, డి పరంగిణి, రాంప్రసాద్, కృష్ణ, రాధతో పాటు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చార్మినార్‌లో కల్తీ ఫాస్ట్ ఫుడ్ గోదాముపై హెచ్ ఫాస్ట్ ఆకస్మిక దాడి!

**హైదరాబాద్, మహా.:** హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ పరిధిలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఒక అక్రమ ఫాస్ట్ ఫుడ్ గోదాము బండారం బయటపడింది. నగరంలో ఆహార కల్తీ, అసురక్షిత పద్ధతులపై ఉక్కుపాదం మోపుతున్న హెచ్‌ఫాస్ట్ (హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్) బృందం.. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తో కలిసి హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆకస్మిక దాడులు నిర్వహించింది. విశ్వసనీయ సమాచారం మేరకు చార్మినార్‌లోని పంచ్ మొహల్లా, న్యూ లాడ్ బజార్‌లో ఉన్న 'మెసర్స్ అల్ అక్బర్ ఫాస్ట్ ఫుడ్ అండ్ గోడౌన్' ప్రాంగణాన్ని అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించేలా అత్యంత అపరిశుభ్రమైన, ప్రమాదకరమైన పరిస్థితుల్లో అక్కడ ఆహార పదార్థాలను తయారు చేసి నిల్వ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కనీస అనుమతులు లేకుండా, ఎలాంటి ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తీసుకోకుండానే గుట్టుచప్పుడు కాకుండా ఈ దందాను నడిపిస్తున్నారు. ఆహారం ఆకర్షణీయంగా కనిపించేందుకు నిషేధిత, కృత్రిమ రంగులైన ఎంఎస్కే లయన్ గ్రీన్, రాస్ప్‌బెర్రీ రెడ్ వంటి రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నట్లు తేలింది. వీటికి తోడు పాడైపోయిన, అత్యంత ప్రమాదకరమైన వంట నూనెనే పదే పదే ఉపయోగిస్తున్నారని నిర్ధారించారు. కనీస నాణ్యత లేని నీటిని వాడటంతో పాటు, ఆ గోదాము పరిసరాల్లో కీటకాల నియంత్రణ లేకపోవడం వల్ల తీవ్ర అపరిశుభ్ర వాతావరణం నెలకొందని అధికారులు గుర్తించారు. దాడుల అనంతరం ఈ గోదాము నుంచి సుమారు 110 కిలోల ఫ్రైడ్ చికెన్, ఒక్కొక్కటి 15 లీటర్ల సామర్థ్యం గల 6 వంట నూనె టిన్నులు, ప్రాణాంతకమైన కృత్రిమ రసాయన ఆహార రంగులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఇద్దరు బాధ్యులను అదుపులోకి తీసుకున్నారు

### అన్నవరం సత్యదేవుని ఆదాయం కోట్లలో
# భక్తులపై భారం ఏల?

- రూ.157 కోట్లకు పైగా ఆదాయం అంచనా.
- అయినా పెరుగుతున్న రుసుములు, పారదర్శకతపై ప్రశ్నలు
- శాశ్వత ఈవో లేకపోవడం, రాజకీయ మర్యాదల ఖర్చులు, పరిపాలనపై విమర్శలు





ప్రస్తుతం ఇన్చార్జ్ ఈవోగా ఉన్న నల్లం చక్రధర్ రావు

**అన్నవరం, మహా** : రాష్ట్రంలోని అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం మరోసారి చర్చనీయాంశంగా మారింది. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన ఈ దేవస్థానం ప్రస్తుతం ఆదాయం, వ్యయాలు, పరిపాలనా వ్యవహారాలు, భక్తులపై పెరుగుతున్న ఆర్థిక భారం వంటి అంశాల కారణంగా విమర్శలు ఎదుర్కొంటోంది. దేవస్థానం ప్రకటించిన 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ అంచనాల ప్రకారం మొత్తం ఆదాయం రూ.157 కోట్లకు పైగా వచ్చింది. హుండీ కానుకలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, ప్రసాదాల విక్రయాలు, దర్శన టికెట్లు, వసతి సదుపాయాల ద్వారా భారీగా ఆదాయం సమకూరుతోంది. అయితే ఇంతటి ఆదాయం లభిస్తున్నప్పటికీ భక్తులపై రుసుముల భారం ఎందుకు పెరుగుతోందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**వ్రతాలు, దర్శనాలు, వసతి... అన్నింటికీ పెరిగిన ధరలు**

ఇటీవలి కాలంలో వ్రతాల రుసుములు, ప్రత్యేక దర్శన టికెట్ల ధరలు, వసతి గదుల అద్దెలు పెరిగిన విషయం తెలిసిందే. సాధారణ భక్తులు ఆలయ దర్శనానికి వచ్చే సమయంలో గతంతో పోలిస్తే అధిక వ్యయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు కోట్ల రూపాయల ఆదాయం వస్తుండగా, మరోవైపు భక్తులపై అదనపు భారం మోపాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దేవస్థానం ఆదాయాన్ని భక్తుల సౌకర్యాల విస్తరణకు వినియోగిస్తున్నారా? లేక పరిపాలనా వ్యయాలే అధికమవుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**పెరుగుతున్న పరిపాలనా ఖర్చులు**

దేవస్థానంలో ఉద్యోగుల జీతభత్యాలు, పరిపాలనా ఖర్చులు, ఇతర నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదాయం పెరుగుతున్న కొద్దీ భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అందుకు బదులుగా రుసుములు పెరగడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆలయ అభివృద్ధి పనులకు, యాత్రికుల సౌకర్యాల పెంపుకు ఎంత నిధులు కేటాయిస్తున్నారు? పరిపాలనా ఖర్చులకు ఎంత వెచ్చిస్తున్నారు? అనే అంశాలపై పూర్తి వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని భక్తులు కోరుతున్నారు.

**రాజకీయ పర్యటనలకు. దేవస్థానం నిధుల వినియోగమా?**

ఇటీవలి కాలంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఆలయ పర్యటనల సందర్భంగా దేవస్థానం తరపున ప్రత్యేక మర్యాదలు, కండువాలు, స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలు అందిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఒక నాయకుడి వెంట వందలాది మంది అనుచరులు వచ్చిన సందర్భాల్లో వారికి కూడా దేవస్థానం తరపున ఏర్పాట్లు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ ఖర్చులకు సంబంధించిన లెక్కలు ఏమిటి? ఎవరి అనుమతితో ఈ వ్యయాలు జరుగుతున్నాయి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

**శాశ్వత ఈవో నియామకంపై సందిగ్ధత**

అన్నవరం దేవస్థానంలో పూర్తి స్థాయి శాశ్వత ఈవో లేకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. కీలకమైన ఈ దేవస్థానానికి ఎందుకు ఇప్పటికీ శాశ్వత కార్యనిర్వాహక అధికారి నియామకం జరగలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన పలువురు అధికారులు వివాదాల్లో చిక్కుకోవడం, తరచూ బదిలీలు జరగడం వంటి పరిణామాలు కూడా అనుమానాలకు తావిస్తున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

**డిజిటల్ వ్యవస్థపై ప్రశంసలు... అమలుపై సందేహాలు**

దేవస్థానంలో డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ప్రవేశపెట్టడం ఆధునికతకు నిదర్శనంగా భావిస్తున్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వృద్ధులు, నిరక్షరాస్యులు, సాధారణ భక్తులకు ఇబ్బందులు లేకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉన్నాయా? అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. డిజిటల్ లావాదేవీల నిర్వహణలో పారదర్శకత, పర్యవేక్షణ, భద్రతా ప్రమాణాలపై కూడా స్పష్టత అవసరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**శ్వేతపత్రం విడుదల చేయాలంటున్న భక్తులు**

అన్నవరం దేవస్థానం ఏ రాజకీయ పార్టీకి చెందినది కాదు. ఇది కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక. భక్తులు సమర్పించే ప్రతి రూపాయి పవిత్రమైనదని, ఆ నిధుల వినియోగంపై పూర్తి పారదర్శకత ఉండాలని భక్తులు కోరుతున్నారు. దేవస్థానం ఆదాయంవ్యయాలపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని, వివాదాస్పద ఖర్చులపై స్వతంత్ర విచారణ జరపాలని, శాశ్వత ఈవోను నియమించాలని, అవసరం లేని ఖర్చులను నియంత్రించాలని హిందూ సంఘాలు, భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. "ఆలయాలను నిలబెట్టేది అధికారులు కాదు... రాజకీయ నాయకులు కాదు... భక్తులే. అందుకే భక్తుల విశ్వాసాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత" అని పలువురు భక్తులు అభిప్రాయపడుతున్నారు.

## విద్యాశాఖను వికాసం వైపు నడిపిస్తున్నాం

**సీఎం రేవంత్‌రెడ్డి**




**హైదరాబాద్, మహా :** విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలి. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తాం" అని రేవంత్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, కేశవరావు, షబ్బీర్ అలీ, వీహెచ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ కాబోయే ప్రధాని

- డాక్టర్ సెల్ రక్తదానశిబిరంలో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్, మహా :** ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని గాంధీ భవన్‌లో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం టీపీసీసీ డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ విభాగం స్టేట్ చైర్మన్ డాక్టర్ రాజీవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, వైద్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకాగా, ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాతలను అభినందించారు. రాహుల్ గాంధీ ఈ దేశానికి కాబోయే ప్రధాని అని, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలే రాహుల్ గాంధీ ఆశయాలకు నిజమైన సాక్ష్యం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజాసేవకు ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు జీవనాధారం అందించవచ్చని డాక్టర్ రాజీవ్ పేర్కొన్నారు. మంత్రి సీతక్క ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 250 మందికి పైగా రక్తదానం చేయగా, రక్తదానం మహాదానం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని డాక్టర్ రాజీవ్ పేర్కొన్నారు.

### బలమైన రాష్ట్రాలతోనే
# నవభారత నిర్మాణం

- స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్' మంత్రంతో ఏపీ అడుగులు.
- మాకు ఇగోలు లేవు.. రాష్ట్ర ప్రగతే మా లక్ష్యం.
- పారిశ్రామికవేత్తలకు కేవలం వాట్సాప్ దూరంలోనే ఉంటా.
- కోల్‌కతా ఐసీసీ ప్లీనరీ సదస్సులో పెట్టుబడిదారులకు మంత్రి నారా లోకేశ్ ఆహ్వానం



**కోల్‌కతా,మహా** : రాష్ట్రాలు ఆర్థికంగా, పారిశ్రామికంగా బలంగా ఉన్నప్పుడే సర్వతోముఖాభివృద్ధి సాధించిన బలమైన భారతదేశ నిర్మాణం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. రాష్ట్రాల మధ్య నెలకొనే ఆరోగ్యకరమైన పోటీ దేశాభివృద్ధికి నిజమైన చోదకశక్తిగా పనిచేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కోల్‌కతాలోని ఐటీసీ సోనార్ హోటల్ వేదికగా ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఆధ్వర్యంలో 'ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలు' అనే అంశంపై జరిగిన ప్లీనరీ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం సభికులను విశేషంగా ఆకట్టుకుంది. పారిశ్రామిక రంగంలో నూతన విప్లవానికి తెరలేపిన ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో దేశ, విదేశీ పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని ఆయన మనస్ఫూర్తిగా ఆహ్వానించారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సుస్థిర ప్రగతితో ముందుకెళ్తోందని, కేంద్రం పారిశ్రామిక రంగంలో తీసుకొస్తున్న నూతన సంస్కరణలను ఆచరణలో పెట్టడంలో ఆంధ్రప్రదేశ్ సత్తా చాటుతోందని మంత్రి వివరించారు. ముఖ్యంగా దేశంలోకి వస్తున్న మొత్తం పెట్టుబడుల్లో ఏకంగా 25 శాతం ఏపీకే దక్కుతుండటం తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఆయన గర్వంగా చెప్పారు. తమ రాష్ట్రం ప్రధానంగా 'స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్' అనే మూడు మూలస్తంభాల ఆధారంగా ముందుకు సాగుతోందని లోకేశ్ స్పష్టం చేశారు. కేవలం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వరకే పరిమితం కాకుండా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గూగుల్ లాంటి గ్లోబల్ సంస్థ పెట్టుబడిని 13 నెలల్లోనే సాధించడం, ఒకే ఒక్క జూమ్ కాల్ ద్వారా ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టును ఖరారు చేయడం, పుట్టపర్తిలో 37 రోజుల రికార్డు వ్యవధిలోనే 600 ఎకరాలు సేకరించి పరిశ్రమకు శంకుస్థాపన చేయడం తమ వేగానికి ఉదాహరణలని వివరించారు. పారిశ్రామిక విధానాల్లో స్థిరత్వాన్ని కొనసాగిస్తూనే, ప్రభుత్వాన్ని కేవలం ఒక నియంత్రణ సంస్థగా కాకుండా సేవలు అందించే భాగస్వామిగా మలుచుకున్నామని తెలిపారు. మార్వాడీల వ్యాపార సూత్రమైన 'కస్టమర్ ఈజ్ గాడ్' స్ఫూర్తితోనే పారిశ్రామికవేత్తలను దేవుళ్లుగా భావించి సేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

ఇదే సదస్సులో పశ్చిమ బెంగాల్‌తో ఉన్న అనుబంధాన్ని, ఆ రాష్ట్ర ప్రాముఖ్యతను లోకేశ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. బెంగాల్ ఈరోజు ఏది ఆలోచిస్తుందో, రేపు యావత్ భారతదేశం అదే ఆలోచిస్తుందనే నానుడిని తాను చిన్నప్పటి నుంచి వింటూ పెరిగానని గుర్తుచేసుకున్నారు. భారత దేశ మేధో, సాంస్కృతిక, ఆర్థిక ప్రస్థానానికి కోల్‌కతాయే అసలైన రాజధాని అని కితాబిచ్చారు. అంతకుముందు రోజు బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని స్వయంగా కలిసిన విషయాన్ని పంచుకుంటూ, అమరావతి రాజధాని నిర్మాణం కోసం భావోద్వేగాలతో ముడిపడి ఉన్న భూములను రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ ద్వారా ఏ విధంగా సేకరించగలిగామో ఆమెకు వివరించినట్లు తెలిపారు. అభివృద్ధి పట్ల మమతా బెనర్జీకున్న అంకితభావం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆయన ప్రశంసించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అపార అనుభవం, దార్శనికతతో 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల బృహత్తర ఆర్థిక వ్యవస్థగా నిలపడమే తమ లక్ష్యమని లోకేశ్ ఉద్ఘాటించారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా రానున్న జులై నెలలో ప్రతిష్ఠాత్మక భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించడంతో పాటు, మంగళగిరిలో అంతర్జాతీయ స్థాయి జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్క్‌ను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఏపీలో ప్రస్తుతం ఉన్నది యువశక్తి, నైపుణ్యంతో నిండిన కేబినెట్ అని, తమకు ఎలాంటి ఇగోలు, అహాలు లేవని, కేవలం రాష్ట్ర అభివృద్ధి సాధించాలనే కసితో మాత్రమే పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలకు తాను కేవలం ఒక వాట్సాప్ మెసేజ్ దూరంలోనే అందుబాటులో ఉంటానని, వారు రాష్ట్రంలో పెట్టే ప్రాజెక్టును తమ సొంత ప్రాజెక్టుగా భావించి వేగంగా అనుమతులు ఇప్పించే బాధ్యత తనదేనని లోకేశ్ అభయమిచ్చారు. ఈ ప్రతిష్ఠాత్మక సమావేశంలో ఐసీసీ ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు కేశవ్ భజంక సహా పలువురు జాతీయ స్థాయి కార్పొరేట్ ప్రముఖులు పాల్గొన్నారు.

## హోంమంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు.

- గుడివాడ అమర్‌నాథ్‌కు మహిళా కమిషన్ నోటీసులు!
- ఈ నెల 24న విచారణకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం.
- సుమోటోగా కేసు నమోదు చేసి సీరియస్ యాక్షన్.
- తన వ్యాఖ్యలను టీడీపీ వక్రీకరించిందన్న మాజీ మంత్రి అమర్‌నాథ్.



**అమరావతి, మహా:** రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ షాక్ ఇచ్చింది. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన కమిషన్.. ఈ వ్యవహారాన్ని సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసినట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు విచారణకు హాజరుకావాలంటూ ఆయనకు నోటీసులు జారీ చేసింది.

**జూన్ 24న విచారణకు ఆదేశం**

హోంమంత్రిపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి తగిన ఆధారాలతో సహా వివరణ ఇచ్చేందుకు జూన్ 24వ తేదీ ఉదయం 11 గంటలకు కమిషన్ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని గుడివాడ అమర్‌నాథ్‌ను నోటీసుల్లో ఆదేశించారు. ఒకవేళ నిర్దేశిత గడువులోగా స్పందించని పక్షంలో.. కమిషన్ వద్ద ఇప్పటికే అందుబాటులో ఉన్న ఫిర్యాదులు, వీడియో క్లిప్‌లు, ఇతర ఆధారాలను బట్టి చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని మహిళా కమిషన్ అందులో తీవ్రంగా హెచ్చరించింది.

**దుమారం రేపిన 'మేకప్' వ్యాఖ్యలు**

ఇటీవల రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశిస్తూ అమర్‌నాథ్ పరుష పదజాలంతో విమర్శలు చేశారు. ఆమెను "మేకప్ మినిస్టర్" అని అభివర్ణించడమే కాకుండా, ఆమె వేసుకునే మేకప్‌తో గోడలకు పుట్టీ కూడా పెట్టుకోవచ్చంటూ తీవ్ర వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఒక మహిళా మంత్రిపై మాజీ మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యక్తిగత, కించపరిచే వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ఈ వ్యాఖ్యలు మహిళల గౌరవానికి భంగం కలిగించేవిగా పరిగణిస్తూ మహిళా కమిషన్ తాజా చర్యలు చేపట్టింది.

**వెనక్కి తగ్గేది లేదన్న అమర్‌నాథ్**

తన వ్యాఖ్యలపై వివాదం చెలరేగడంపై గుడివాడ అమర్‌నాథ్ స్పందించారు. అధికార టీడీపీ రాజకీయ ప్రయోజనాల కోసమే తన మాటలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరిస్తోందని ఆయన ఆరోపించారు. తాను మహిళలను గానీ, ఏ ఒక్క వర్గాన్ని గానీ కించపరిచే ఉద్దేశంతో మాట్లాడలేదని, కేవలం ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు మాత్రమే తాను కౌంటర్ ఇచ్చానని సమర్థించుకున్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేసిన ఆయన.. భవిష్యత్తులోనూ మంత్రి అనిత తీరు మారకపోతే తన స్పందన ఇలాగే ఉంటుందని తేల్చిచెప్పారు.

## యువశక్తితోనే వికసిత భారత్: కిషన్ రెడ్డి

- పీఎం-వీబీఆర్‌వైతో 3.5 కోట్ల ఉద్యోగాల లక్ష్యం
- యువతకు రూ.15 వేల ప్రోత్సాహకం
- 2026 నాటికి ప్రపంచ శ్రామిక శక్తిలో 66% భారతీయులు
- జాబ్ సీకర్స్ నుంచి జాబ్ క్రియేటర్స్‌గా యువత ఎదుగుదల
- తెలంగాణలో 25 వేలకుపైగా సంస్థల నమోదు

**హైదరాబాద్, మహా:** భారత అభివృద్ధికి యువశక్తి, శ్రామికశక్తే ప్రధాన బలమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం యువతకు పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ప్రధాన మంత్రి వికసిత భారత్ రోజ్‌గార్ యోజన' సదస్సులో మాట్లాడిన ఆయన, రూ.99,446 కోట్ల వ్యయంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా రాబోయే రెండేళ్లలో దేశవ్యాప్తంగా 3.5 కోట్ల కొత్త ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. తొలిసారి ఫార్మల్ రంగంలో ఉద్యోగాల్లో చేరే యువతకు రూ.15 వేల వరకు ఆర్థిక ప్రోత్సాహకం అందిస్తామని చెప్పారు. ఏప్రిల్ 2020 నుంచి 2025 వరకు 3.45 కోట్ల మంది యువత ఫార్మల్ వర్క్‌ఫోర్స్‌లో చేరారని, ప్రతి ఏడాది సగటున 80 లక్షల మంది యువత శ్రామిక శక్తిగా మారుతున్నారని వెల్లడించారు. 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా కొత్తగా ఉద్యోగ రంగంలోకి వచ్చే వారిలో 66 శాతం మంది భారతీయులే ఉంటారని అంచనా వేశారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాల ఫలితంగా భారత యువత ఉద్యోగాలు కోరేవారి స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదుగుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో 2.2 లక్షల స్టార్టప్‌లు, 120కిపైగా యూనికార్న్‌లు ఉన్నాయని, భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా నిలిచిందని తెలిపారు.



## ప్రాణాలకు రక్షణ.. పాదచారులకే పెద్దపీట!

- ఫుట్‌పాత్‌పై నడవడం ప్రాథమిక హక్కు.
- సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు.
- నిర్వహణ బాధ్యత స్థానిక సంస్థలదేనని స్పష్టీకరణ.

**ఢిల్లీ, మహా** : దేశ రహదారులపై పాదచారుల భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన, చారిత్రక తీర్పును వెలువరించింది. సక్రమంగా నిర్మించి, ఎలాంటి ఆక్రమణలకు తావులేకుండా నిర్వహించే ఫుట్ పాత్‌లపై నడవడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. వాహనాల రాకపోకల కంటే పాదచారుల హక్కులకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని తేల్చిచెబుతూ.. ఫుట్ పాత్‌ల నిర్మాణం, నిర్వహణ పూర్తిగా స్థానిక సంస్థల బాధ్యతేనని తేల్చిచెప్పింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఏ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పును వెల్లడించింది. భారత రాజ్యాంగం ప్రసాదించిన ఆర్టికల్ 19(1)(డి) ప్రకారం దేశవ్యాప్తంగా స్వేచ్ఛగా సంచరించే హక్కు, ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో భాగంగానే ఫుట్ పాత్‌పై నడిచే హక్కు కూడా అంతర్భాగమని ధర్మాసనం తన తీర్పులో అత్యంత ప్రస్ఫుటంగా పేర్కొంది. ప్రతి పౌరుడు గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు సురక్షితమైన ఫుట్ పాత్‌లు అత్యవసరమని, ఆ సదుపాయాలను కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వ అధికారులపైనే ఉందని జస్టిస్ నరసింహ ఈ సందర్భంగా వివరించారు. కర్ణాటకలో చోటుచేసుకున్న ఓ విషాదకర ఘటన ఈ చారిత్రక తీర్పునకు దారితీసింది. పాఠశాలకు వెళుతున్న ఓ చిన్నారి బాలుడిని లారీ ఢీకొట్టడంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఆ రహదారి వెంబడి సరైన ఫుట్ పాత్ లేకపోవడమే ఈ ఘోర ప్రమాదానికి ప్రధాన కారణమని కోర్టు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో బాధితుడి కుటుంబానికి చెల్లించాల్సిన పరిహారాన్ని సుప్రీంకోర్టు రూ.11.44 లక్షలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నగరాల్లో ఫుట్ పాత్‌లు సక్రమంగా లేకపోవడం, ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు గురికావడం, అసలు అందుబాటులోనే లేకపోవడం వంటి ప్రధాన సమస్యలను ధర్మాసనం ప్రస్తావించింది. ఇది కేవలం మౌలిక సదుపాయాల లేమి మాత్రమే కాదని, ఒక నాగరికతా సమస్య అని న్యాయస్థానం అభివర్ణించింది. రహదారులు నిర్మించిన ప్రతిచోటా విధిగా ఫుట్ పాత్‌లను సైతం నిర్మించి, వాటిని నిరంతరం సంరక్షించాల్సిన గురుతర బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలదేనని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. పాదచారుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఒక సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని సూచించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తాజా తీర్పు భవిష్యత్తులో దేశవ్యాప్తంగా పట్టణ ప్రణాళిక, రహదారుల నిర్మాణ విధానాలపై అత్యంత సానుకూల ప్రభావం చూపుతుందని న్యాయనిపుణులు విశ్లేషిస్తున్నారు.



## బంగారంలా మెరిసిపోతున్న ఊర్వశీ..

**బాలీవుడ్ క్రేజీ బ్యూటీ ఊర్వశీ రౌతేలా గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం**

### బాలీవుడ్ క్రేజీ బ్యూటీ

ఈ బ్యూటీకి ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. బాలీవుడ్‌లోన కాకుండా టాలీవుడ్‌లో కూడా విపరీతమైన ఫేమ్ ఉంది.

### బాలీవుడ్, టాలీవుడ్

బాలీవుడ్‌లో సినిమాలు మాత్రమే కాకుండా, స్పెషల్ సాంగ్స్ చేస్తూ అలరిస్తుంది. తన అంద చందాలతో ఆకట్టుకుంటుంది.

### సినిమాలు, స్పెషల్ సాంగ్స్

ముఖ్యంగా ఈ అందాల ముద్దుగుమ్మ తెలుగులో ఐటమ్ సాగ్స్ చేస్తూ, తన అదిరిపోయే స్టెప్పులతో అందరినీ ఆకట్టుకుంటుంది.

### ఐటమ్ సాంగ్స్, అదిరిపోయే స్టెప్స్

ఇప్పటికీ ఈ అమ్మడు ఏజెంట్, బ్రో , స్కంద , డాకు మహారాజ్ వంటి చాలా సినిమాల్లో ఐటమ్ సాంగ్స్ చేస్తూ అదరగొట్టింది.

### వరసగా ఫుల్ బీజీగా

ముఖ్యంగా డాకు మహారాజ్ మూవీలో ఈ చిన్నది కీలక పాత్రలో నటించి మెప్పించింది. తన నటన, గ్లామర్‌తో అదరగొట్టింది.

### డాకు మహారాజ్

ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది ఎప్పటికప్పుడు తన బ్యూటిఫుల్ ఫొటోస్ షేర్ చేస్తుంటుంది.

### సోషల్ మీడియా

ఈ క్రమంలోనే తాజాగా ఈ ముద్దుగుమ్మ తన ఇన్ స్టాలో క్యూట్ పిక్స్ షేర్ చేసింది. అవి సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.



## స్పీడ్ పెంచిన టాలీవుడ్ చందమామ..

టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్. తెలుగులో ఒకప్పుడు తోపు హీరోయిన్ గా రాణించింది కాజల్ అగర్వాల్. తెలుగులోనే కాదు తమిళ్ ల్లోనూ సినిమాలు చేసింది ఈ అమ్మడు. ఇక పెళ్లి తర్వాత ఈ అమ్మడు సెకండ్ ఇనింగ్స్ మొదలు పెట్టింది . జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంఐజీ ప్రొడక్షన్ అండ్ స్టూడియోస్ సహకారంతో తెరకెక్కుతున్న 'ది ఇండియా స్టోరీ' చిత్రానికి సంబంధించిన తొలి అధికారిక పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లతో ఆసక్తిని పెంచిన చిత్రబృందం, తాజాగా విడుదల చేసిన ఈ పోస్టర్‌తో సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. ఈ పోస్టర్‌లో కాజల్ అగర్వాల్ ఓ న్యాయవాదిగా, శ్రేయస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రిగా కనిపిస్తున్నారు. అలాగే శ్రేయస్ కుమార్తె పాత్రలో కనిపిస్తున్న చిన్నారి ద్వారా, లక్షలాది కుటుంబాలను ప్రభావితం చేస్తున్న ఒక తీవ్రమైన సమస్య వెనుక ఉన్న మానవీయ కోణాన్ని పోస్టర్ బలంగా చూపించింది. . ముంబై హైకోర్టు నేపథ్యంతో రూపొందించిన ఈ పోస్టర్‌లో, సాక్షుల బోనులో ఉంచిన పురుగుమందు సిలిండర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆహార కల్తీ అనే అత్యంత కీలకమైన సమస్యపై సాగే కోర్ట్‌రూమ్ డ్రామాకు ఇది సంకేతంగా కనిపిస్తోంది. ఈ చిత్రానికి చెట్టన్ డీకే దర్శకత్వం వహించగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించి నిర్మిస్తున్నారు. జూలై 24, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. భారత దేశంలో ప్రజారోగ్యానికి సంబంధించిన అత్యంత కీలకమైన, తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే ఆహార కల్తీ సమస్యను ఈ చిత్రం ప్రధానాంశం. సాధారణ ప్రజలు ప్రతిరోజూ వినియోగించే ఆహార పదార్థాల వెనుక దాగి ఉన్న ప్రమాదాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, సమాజంలో అవగాహన పెంచే ప్రయత్నం చేయనుంది. దర్శకుడు చెట్టన్ డీకే మాట్లాడుతూ, "ఆహార కల్తీ కారణంగా కుటుంబ సభ్యులు, కావాల్సిన వారిని కోల్పోయిన ప్రతి భారతీయుడి కథే 'ది ఇండియా స్టోరీ'. మన సమాజంలో అత్యంత నిర్లక్ష్యానికి గురవుతున్నప్పటికీ అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఆహార కల్తీ ఒకటి.



## సీతాకోక చిలుకలా డ్రాగన్ బ్యూటీ కయాదు లోహర్..

**డ్రాగన్ బ్యూటీ కయాదు లోహర్ ప్రస్తుతం నాని ది ప్యారడైజ్‌లో కనిపించనుంది. ఈ మూవీ ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ గ్రీన్ డ్రెస్‌లో ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ పిక్స్‌లో సీతాకోక చిలుకలా మరింత అందంగా కనిపించింది. ఈ ఫోటోలు మీరు కూడా చూసేయండి..**







## మొనాకో వేకేషన్‌లో లైగర్ భామ అనన్య పాండే..



**బాలీవుడ్ భామ అనన్య పాండే హాలీడే ట్రిప్ ఎంజాయ్ చేస్తోంది. ప్రస్తుతం మొనాకో వేకేషన్‌లో చిల్ అవుతోంది. ఈ ట్రిప్‌కు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అవీ మీరు కూడా చూసేయండి...**



## అఖండ బ్యూటీ హాట్ లుక్స్.. హీటెక్కిస్తున్న ప్రగ్యా

ప్రగ్యా జైస్వాల్.. కంచె సినిమాతో తెలుగు ఆడియన్స్ మనసు దోచుకున్న హీరోయిన్. ఆ తర్వాత కూడా కొన్ని సినిమాలు చేసింది కానీ ఒక్కటి కూడా సక్సెస్ కాలేదు. ప్రగ్యా పర్సనల్ విషయానికి వస్తే.. 1991 జనవరి 12న జన్మించిన ఈమె ముందుగా కొన్ని యాడ్ ఫిల్మ్‌స్‌లో నటించింది. ప్రగ్యా జైస్వాల్ పూణెలోని సింబైసిస్ లా స్కూల్‌లో చదువుకుంది. కాలేజీలో అందాల పోటీల్లో పాల్గొని అక్కడ కూడా సత్తా చాటింది. 2014లో తెలుగు, తమిళ్ బైలింగ్వల్ 'విరాట్టు/ డేగ' సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో 2015లో క్రిష్ దర్శకత్వంలో తెరకెక్కిన వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కిన 'కంచె' సినిమాతో పరిచయమైంది. తొలి సినిమాతోనే బెస్ట్ ఫీమేల్ డెబ్యూ అవార్డు కైవసం చేసుకుంది.హిందీలో టిటూ MBA సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఇక ఈమె తెలుగులో కంచె తర్వాత చేసిన 'నక్షత్రం' (2017), మంచు విష్ణుతో చేసిన 'ఆచారి అమెరికా యాత్ర' సినిమాలు ఈమెకు సక్సెస్ ఇవ్వలేకపోయాయి. గత ఏడాది వచ్చిన 'డాకు మహారాజు' సినిమాలోనూ, అలాగే రీసెంట్‌గా వచ్చిన 'అఖండ2'లోనూ బాలయ్య సరసన నటించి బ్యాక్ టు బ్యాక్ హిట్లను తన ఖాతాలో వేసుకుంది.ఈ మూవీల మంచి విజయం సాధించినప్పటికీ ప్రగ్యాకు టాలీవుడ్‌లో కొత్త ఆఫర్లు పెద్దగా రాలేదు. ప్రస్తుతం చేతిలో ఎలాంటి ప్రాజెక్టులు లేకపోవడంతో తన పూర్తి ఫోకస్ సోషల్ మీడియాపై పెట్టింది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034